క్లుప్తంగా

గుళ్లపల్లికి 'వేద ధర్మప్రచారమణి' బిరుదు



గుళ్లపల్లిని సత్కరిస్తున్న విశ్వనాథ శాస్త్రి తదితరులు

సీటీఆర్: వేద వేదాంగములు, వేదార్థం, సలక్షణ ఘనాంతములో విశేష కృషి చేసిన గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠికి సన్మానం చేయడమంటే వేద విద్యను గౌరవించుకోవడమేనని కంచి కామకోటి పీఠం ప్రతినిధి చల్లా విశ్వనాథ శాస్త్రి అన్నారు. శనివారం త్యాగరాజ నారాయణదాస సేవాసమితి ఆడిటోరియంలో దత్తాత్రేయ వేద విద్యా గురుకులం గౌరవాధ్యక్షుడు, ప్రధాన ఆచార్యుడు గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠిని 'వేద ధర్మ ప్రచారమణి' బిరుదుతో కంచి కామకోటి పీఠం తరఫున సత్కరించారు. పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి సత్యచంద్రశేఖర సరస్వతీ స్వాములు ఆశీర్వచనాలు ఆయన ఈ సందర్భంగా వినిపించారు. సదాచార పరిరక్షణలో, వేద విద్యాప్రచారంలో గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని వారన్నారు. సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, పలువురు వేద పండితులు పాల్గొన్నారు.

ఘనంగా వేద స్వస్తి

సీటీఆర్ఐ: ఘనంగా వేద స్వస్తి కార్యక్రమం నిర్వహించినట్టు కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి అన్నారు. స్థానిక సరస్వతి ఘాట్‌లో శ్రీజ్ఞానసరస్వతీ పీఠంలో బులుసు వార్షిక వేద సభ శనివారం నిర్వహించారు. స్వాధ్యాయరత్న గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.15 మందికి వేద పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో 150 మంది ఘనపాఠీలు, వంద మంది క్రమపాఠీలను సత్కరించారు.

రూ. 20వేలు అదనపు డిపాజిట్ అందజేత

కడియం: జేగురుపాడు ఉన్నత పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదును అందించేందుకు గ్రామానికి చెందిన ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ రూ. 20వేలు డిపాజిట్‌గా అందజేసారు. గతంలో తన తల్లిదండ్రులు పేరిట రూ. 80 వేలను ఈయనే డిపాజిట్ చేసి, వాటిపై వచ్చే వడ్డీతో విద్యార్థులకు ప్రైజ్‌మనీని అందజేసేవారు. దీనికి అదనంగా రూ. 20వేలు జత చేయడంతో మొత్తం రూ.లక్ష ఫిక్సిడ్ డిపాజిట్‌గా అయ్యింది. దీనిపై వచ్చే వడ్డీని ఇకపై వినియోగించనున్నారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లలో స్వచ్ఛ ఆంధ్ర

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర శనివారం నిర్వహించారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్లు, పరిసర ప్రాంతాల్లో స్టేషన్ అధికారులు, పోలీసు సిబ్బంది చెత్త మొక్కలు, పరిసరాల పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేశారు. ప్రతి నెల మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అన్ని పోలీస్ స్టేషన్లలో చేపట్టాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఎస్‌డీపీవో, పోలీస్ సర్కిల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల వద్ద మొక్కలు నాటారు.

విభిన్న రూపాల్లో వినాయకుడు

- ఆకర్షణీయంగా భారీ విగ్రహాలు సిద్ధం
- తుది మెరుగులు దిద్దుతున్న రాజస్తాన్ కళాకారులు
- విగ్రహాల తయారీలో 9 నెలలుగా నిమగ్నం



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన గణనాథుడి విగ్రహాలు



తయారీ దశలో ఉన్న విగ్రహాలు

ధవళేశ్వరం: గణేశ్ ఉత్సవాలకు భారీ గణనాథులు సిద్ధమయ్యారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు కళాకారులు తుది మెరుగులు దిద్దుతున్నారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు గణనాథులను తీసుకువెళ్లేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధమవుతున్నారు. ధవళేశ్వరం శివారు బాలుర హైస్కూల్ వద్ద గణనాథుల విగ్రహాలను తయారు చేస్తున్నారు. తొమ్మిది నెలలుగా విగ్రహాల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు. ఐదు నుంచి 11 అడుగుల ఎత్తులో వీటిని తయారు చేస్తున్నారు. ధవళేశ్వరం నుంచి దూర ప్రాంతాలకు విగ్రహాలను పంపుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు ధవళేశ్వరం వచ్చి తమకు నచ్చిన విగ్రహాలను ఎంచుకొని అడ్వాన్సులు ఇచ్చి వెళుతున్నారు. శివపార్వతులతో కూడిన వినాయక విగ్రహాలు, వివిధ ఆకృతులతో కూడిన గణనాథులను సిద్ధం చేశారు. ఆకర్షణీయంగా ఉండే ఈ విగ్రహాల కొనుగోలుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఉత్సాహం చూపుతున్నారు.

5 నుంచి 15 అడుగుల ఎత్తు ఉండే విగ్రహాలు సిద్ధం

గణనాథుని విగ్రహాల తయారీని వినాయక చవితికి తొమ్మిది నెలల ముందు ప్రారంభించారు. రాజస్థాన్‌కు చెందిన విగ్రహ తయారీదారులు 20మంది రాత్రీ పగలు కష్టపడి సుమారు 500 విగ్రహాలను తయారీ చేశారు. ప్రస్తుతం విగ్రహాల అమ్మకాన్ని ప్రారంభించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ఈ విగ్రహాలను తయారు చేస్తున్నారు. సుమారు 5 నుంచి 15 అడుగుల ఎత్తు ఉండే ఈ విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో వినాయక పందిళ్లకు తరలిస్తుంటారు. ఇప్పటి వరకు తయారీలో నిమగ్నమైన వీరు ప్రస్తుతం విగ్రహాల అమ్మకాల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో తయారీదారుల్లో ఆందోళన నెలకొంది. సాధ్యమైనంత త్వరగా అమ్మకాలు ముగించుకోవాలని వారు ఎదురుచూస్తున్నారు.





ప్రత్యేక ఆకర్షణగా ...

వివిధ రూపాల్లో తయారు చేసిన గణనాథుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. విగ్రహాల తయారీలో విశేష అనుభవం కలిగిన రాజస్థాన్ కళాకారులు తమ కళా నైపుణ్యంతో వీటిని తీర్చిదిద్దారు. పలు రంగులతో పాటు అలంకరణలు మారుస్తూ ఒకదానికి మించి మరొకటి అందంగా తీర్చిదిద్దారు.

9 నెలలుగా శ్రమిస్తున్నాం



గణనాథుడి విగ్రహాలు తయారు చేసేందుకు తొమ్మిది నెలలుగా శ్రమిస్తున్నాం. ధవళేశ్వరం నుంచి సుమారు 200 కిలోమీటర్ల దూరం వీటిని తీసుకువెళుతున్నారు. తమ వద్ద కొనుగోలు చేసిన విగ్రహాలను విజయవాడ, అనకాపల్లి తదితర ప్రాంతాలు తీసుకువెళ్లారు. వినాయక చవితి సమీపిస్తుండటంతో కొనుగోలుదారులు కోసం వేచి చూస్తున్నాం.

– దినేష్‌కుమార్, విగ్రహాల తయారీదారుడు

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



కేక్ కట్ చేస్తున్న సంఘం నాయకులు

కడియం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ) ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతుందని సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ విల్సన్ పాల్ అన్నారు. సంఘం గుర్తింపు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏపీజీఈఏ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాల్గవ తరగతి నుంచి గ్రూప్ 1 అధికార వరకు తమ సంఘంలో సభ్యులుగా ఉన్నారని, 58 ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సమన్వయంతో ప్రభుత్వంతో నేరుగా చర్చలు జరపడానికి గుర్తింపు పొందిందని విల్సన్‌పాల్ వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూర్యశ్రీనివాస్, రాజమహేంద్రవరం రూరల్ తాలూకా యూనియన్ కార్యదర్శి పి.మురళీకృష్ణ, అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టీవీ శ్రీధర్, తాలూకా నాయకులు కేవీఎస్ మూర్తి, వి. ఉమామహేశ్వరి, అన్నపూర్ణ, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు జీ మాధురి, ఎల్ మోహనవంశీ, కల్యాణచక్రవర్తి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవా పురస్కారం పొందిన డాక్టర్ జీవీ మాధురిని ఘనంగా సత్కరించారు.

క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను కలసిన మురళీధర్, వెంకటరావు

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమితులైన సంస్థాగత నాయకులు, కార్యకర్తలంతా క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. జగనన్న సారథ్యంలో పార్టీ మళ్లీ అధికారంలోకి రానుందని, ప్రజలంతా జగనన్నను కోరుకుంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. వైఎస్సార్ సీపీ సిటీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా నియమితులైన గుత్తుల మురళీధర్, జిల్లా జనరల్ సెక్రటరీగా నియమితులైన దాసి వెంకట్రావు శనివారం డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సత్కరించారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- చిన్నారులకు బాలకృష్ణుడి వేషధారణ పోటీలు
- రూ.3లక్షల కరెన్సీతో స్వామి వారి మందిరం అలంకరణ
- ఉత్సాహంగా ఉట్టి ఉత్సవం



ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణులు



ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లో ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి



శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారి

సీటీఆర్ఐ: శ్రీకృష్ణాష్టమి వేడుకలు నగరంలో వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ మందిరం, ఆర్యాపురం వద్దగల శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమంలోని కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ ఆలయంలో జగన్నాథ, బలరామ, సుభద్రల విగ్రహాలకు విశేష పూజలు చేశారు. సాయంత్రం ఉట్టి కొట్టే ఉత్సావాన్ని నిర్వహించారు.

రూ.3 లక్షలతో శ్రీకృష్ణ మందిరం అలంకరణ

స్థానిక ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో భాగంగా శ్రీ త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహరాజ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. రూ.3 లక్షల కరెన్సీతో శ్రీకృష్ణ మందిరాన్ని అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం హరి నామ సంకీర్తనం, ఉట్టి ఉత్సవం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, గురుపూజ, ప్రవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 17వ తేదీన శ్రీ నందోత్సవం నిర్వహిస్తామని ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు.

ప్రత్యేక పుష్పాలంకరణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని రైల్వే హాస్పిటల్ ఎదురుగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని మేళతాళాలలతో ఊరేగించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి పుష్పాలంకరణ చేశారు.

ఉత్సాహంగా ఉట్టి కొట్టిన యువత

కడియం: పలు గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడియంలోని శ్రీ భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి పూజలు నిర్వహించారు. ఆలయ గోశాల సంరక్షణ సమితి అధ్యక్షుడు, బాధ్యత సేవా సమితి అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు) కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారుల భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. యువత కోలాహలం మధ్య ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రారంభించారు. దుళ్లలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీ మదన గోపాలస్వామి ఆలయం వద్ద అర్చకులు ఖండవల్లి వాసు ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.



కడియంలో నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులతో గ్రామస్తులు

రాజరాజ నరేంద్రుడికి నివాళులు

రాజమహేంద్రవరం సిటీ: తూర్పు చాళుక్య వంశానికి చెందిన రాజరాజ నరేంద్రుడు తన పాలనలో సామాజిక, సాంస్కృతిక వారసత్వానికి గణనీయమైన కృషి చేయడంతో రాజమహేంద్రవరం ప్రసిద్ధి చెందిందని, రాజరాజ నరేంద్రుడి ఆస్థాన కవి నన్నయ్యను మహాభారతాన్ని తెలుగులోకి ఆంధ్ర మహాభారతంగా అనువదించాలని అభ్యర్థించాడని ఆయన కారణంగా రాజమహేంద్రవరానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు ఏర్పడి చారిత్రాత్మక నగరంగా ఈనాటికీ వర్ధిల్లుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పుష్కరఘాట్‌లో రాజరాజనరేంద్రుని విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజరాజ నరేంద్రుడు రాజమహేంద్రవరం నగరాన్ని స్థాపించారన్నారు. రాజరాజ నరేంద్రుని జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. జేఏసీ నేత బలరామనాయుడు మాట్లాడుతూ పట్టణంలోని చిత్రాంగి గెస్ట్ హౌస్ పేరు మార్పు చెయ్యాల కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జేటీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీలో మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మట్టా నాగబాబు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తనుబుద్ధి సూర్యభాస్కర్ మాట్లాడుతూ వాజ్‌పేయి దేశాభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెం శ్రీనివాసరావు, బీజేపీ రూరల్ మండల ప్రధాన కార్యదర్శి కర్రి హరికృష్ణ, మండల ఉపాధ్యక్షుడు తాడి కోటేశ్వరరావు, పబ్బితి సతీష్‌కుమార్, కేరా నూకారత్నం, కొయ్యనా సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కంబాలచెరువు: స్థానిక కుమారి థియేటర్ వద్ద శనివారం ఓ వ్యక్తి మృతదేహాన్ని టుటౌన్ పోలీసులు కనుగొన్నారు. రైల్వే వంతెన సమీపంలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడు వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుంది. మృతదేహాన్ని పోలీసులు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. సమాచారం తెలిసిన వారు టుటౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

కంబాలచెరువు: ఎస్పీ ఆదేశాల మేరకు స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఏఎస్పీ ఎల్.చెంచిరెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పేదల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి గౌతు లచ్చన్న అన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవి కుమార్, ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాసరావు, ఆర్ఐ సంజీవ్‌కుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వామ్మో.. వయ్యారి భామ

రాజానగరం: మండలంలోని కలవచర్ల, కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ప్రపంచంలో మొండి జాతికి చెందిన 10 రకాల కలుపు మొక్కలలో ఒకటైన పార్థీనియం (వయ్యారి భామ)పై అవగాహన వారోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో ఈ మొక్క పూర్తిగా నిర్మూలించే దిశగా దేశ వ్యాప్తంగా ఏటా ఆగస్టు 16 నుంచి 22 వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వ్యయారి భామ మొక్క వ్యాప్తి, దానివలన కలిగే రోగాలపై కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, కేవీకేని సందర్శించిన మెరీ స్టెల్లా వ్యవసాయ కళాశాల (విజయవాడ) విద్యార్థులకు అవగాహన కల్పించారు. పార్థీనియం కలుపు మొక్క అమెరికా నుంచి సుమారు 70 ఏళ్ల క్రితం గోధుమ విత్తనాల దిగుమతి ద్వారా మన దేశంలో ప్రవేశించింది.

వయ్యారి భామతో దుష్ప్రభావాలు అధికం

ఈ మొక్కలోని అన్ని భాగాల్లో (కాండం, ఆకులు, కొమ్మల పై నూగు, పుప్పొడి) పార్థీనిస్ అనే విష పదార్థం ఉంటుంది. ఈ విషం వలన మానవాళికి, పశువులకు వివిధ రకాల జబ్బులు సంభవిస్తాయి. ఈ మొక్కల పుప్పొడి వలన మనుషుల్లో శ్వాసకోశ సంబంధ వ్యాధులు (ఆస్తమా), చర్మ వ్యాధులు, విష జ్వరాలు, ఎగ్జిమా, బ్రాంకైటీస్ వ్యాధులు వస్తాయి. పుప్పొడి కలిసిన గాలిని పీలిస్తే జలుబు, కళ్లు ఎర్రబడటం, కనురెప్పల వాపు సంభవిస్తుంది. పశువులకు కూడా ఊపిరితిత్తుల వ్యాధులు, జ్వరాలు, చర్మ వ్యాధులు సోకుతాయి. పాడి పశువులు ఈ మొక్కలను ఆహారంగా తీసుకున్నప్పుడు చర్మ సంబంధమైన వ్యాధులు కలగడమే కాకుండా పాల ఉత్పత్తి తగ్గి, పశువులు బరువును కోల్పోతాయి.

పంటలకు, ఇతర మొక్కలకు నష్టం

పార్థీనియం మొక్క కారణంగా వ్యవసాయంలో 40 శాతం వరకు పంట నష్టం వాటిల్లుతుంది. ఇవి ఒక రకమైన రసాయనాన్ని వేర్ల ద్వారా ప్రవించి ఇతర మొక్కలను మొలకెత్తకుండా నిరోధిస్తాయి. గడ్డి పెరగకుండా చేస్తుంది. ఈ కారణంగా పశుగ్రాసం కొరతకు కారణమవుతాయి. పంటలను ఎదగకుండా చేయడంతో దిగుబడులు గణనీయంగా పడిపోతాయి. ఈ మొక్కల పుప్పొడి వలన టమాటా, వంగ, చిక్కుడు వంటి కూరగాయల మొక్కలు, పాదులు పూత రాలిపోయి, కాయ ఏర్పడకుండా నిరోధిస్తుంది. పిండి నల్లికి ఈ మొక్కలు నివాస స్థలాలుగా ఉపయోగపడతాయి.

నివారణ చర్యలు

ఈ మొక్కల ఉధృతి ఎక్కుగా ఉన్న పొలాల్లో పంట మార్పిడి సాగు ద్వారా కలుపును నివారించవచ్చు. పార్థీనియం మొక్కలను వేర్లతో పాటు తొలగించి తగలబెట్టాలి. జై గో గ్రామా, బై కొలరేటా అనే కీటకాలు ఈ మొక్కల ఆకుల, కాండాన్ని తింటాయి వాటి ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చు. పైరు సాగు చేయని పొలాల్లో ఉప్పు ద్రావణాన్ని 15 లేదా 20 శాతం (లీటరు నీటిని 150 లేదా 200 గ్రా.) పూతకు రాకముందే పిచికారీ చేయాలి. వేసవిలో ఎకరాకు గ్లైఫోసేట్ ఒకటి లేదా 1.5 లీ. పూత దశకు రాకముందే కలుపు మొక్కలపై పిచికారీ చేయడం ద్వారా కూడా వయ్యారి భామ ఉధృతిని తగ్గించవచ్చు.

గౌతు లచ్చన్న ఆశయ సాధనలో ముందడుగు వేద్దాం





గౌతు లచ్చన్నకు నివాళులు అర్పించిన మార్గాని భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

- మాజీ ఎంపీ భరత్‌రామ్, డాక్టర్ గూడూరి ఘన నివాళి
- వై. జంక్షన్‌లో జయంతి సభ

రాజమహేంద్రవరం సిటీ: సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు కలసికట్టుగా కృషి చేద్దామని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. గౌతు లచ్చన్న జయంతిని స్థానిక వైజంక్షన్‌లో శనివారం నిర్వహించారు. గౌతు లచ్చన్న విగ్రహానికి మార్గాని భరత్‌రామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ మాదిరిగా గౌతు లచ్చన్న కూడా సర్దార్ బిరుదు కలిగి ఉండడం తెలుగువారిగా మనందరికీ గర్వకారణమన్నారు. తెలుగు వాడు, గీత కులాలకు చెందిన వ్యక్తి అయిన గౌతు లచ్చన్న అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. బీసీల అభ్యున్నతికి, గీతాల కులాల సంక్షేమానికి ఆయన అందించిన సేవలు మరువరానివన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర ఉపాధ్యక్షులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుత్తుల మురళీధర్, తదితరులున్నారు.

ఆశయాలను కొనసాగించాలి

వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ స్థానిక వైజంక్షన్ వద్ద ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న సేవలను కొనియాడారు. మజ్జి అప్పారావు, పిల్లి నిర్మల తదితరులు ఉన్నారు.

సీటీఆర్ఐ: బడుగు, బలహీన వర్గాలకు దిక్సూచిగా నిలిచిన సర్దార్ గౌతు లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక వై జంక్షన్‌లోని సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. వై.జంక్షన్‌లోని సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు, వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు డి.జార్జి ఆంటోని, ఉపాధ్యక్షుడు బత్తిన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	వార్-2
సూర్యమినీ	:	మహావతార్ నరసింహ,
సూర్యప్యాలెస్	:	వార్-2
స్వామి	:	కూలీ
అనుశ్రీ	:	కూలీ
శివజ్యోతి	:	కూలీ
రాజా	:	వార్-2
ఊర్వశి	:	కూలీ
మేనక	:	మహావతార్ నరసింహ
రంభ	:	వార్-2
అప్సర	:	వార్-2
అశోక	:	వార్-2
నామవరం		
వీఎస్ మహల్	:	కూలీ, వార్-2
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	కూలీ, వార్-2
కడియం		
వెంకటసూర్య	:	కూలీ, వార్-2